

# వసంతం ఎవరి సొంతం?

-ఎనుగంటి వేణుగోపాల్

చి. లక్ష్మీ సౌభాగ్యవతి సుభద్రకి

నీ సమక్షంలో నీకు చెప్పుకోలేని ఎన్నో విషయాలున్నాయి. నీకూ నాకూ తెలిసినవి కొన్ని. నా మనసులోనివి నీ మనసెరుగనివి మరి కొన్ని. వాటన్నింటిని ఈ ఉత్తరంలో పొందుపరుస్తున్నాను. సావధానంగా చదువు. విషయాలన్నీ అవగతమౌతాయి.

నా పెళ్ళయిన ఏడాదికి నా చిట్టి తండ్రి... కాదు.... కాదు... మీ ఆయన పుట్టాడు. వాడు పుట్టిన ఏడాదికే మా ఆయన పోయారు. ఆయన పోయాక ప్రపంచమే శూన్యమన్పించింది. ఒంటరిదాన్నయ్యాను. జీవితం మోడివారిందనుకున్నాను.

దిక్కెవరూ లేని నాకు నా కన్నే తోడయ్యాడు. నా బాబు నవ్వుతుంటే నా జీవితంలోకి మళ్ళీ వసంతం వచ్చిందేమోననిపించేది. వాడి బుల్లి అడుగులతో నన్నూ తిరిగి నడిపించాడు. వాడి తోడే లోకమైంది నాకు.

పొద్దస్తమానం నా కొంగు పట్టుకు తిరిగేవాడు. "అమ్మా... అమ్మా" అంటూ వెంటపడేవాడు.

వాణ్ణి స్కూల్లో చేర్పించాక "అమ్మా! నేను స్కూల్‌కి

రిక్షాలో వెళతానే" అంటే, నా చిట్టి కన్న నడిచి వెళితే ఎక్కడ కందిపోతాడోనని అది నా తాహతుకు మించిన పనే అయినా ఒప్పుకున్నాను. "నా చిన్నా సుఖమే నాక్కావల్సింద"నుకొని రాత్రింబవళ్ళూ కష్టపడేదాన్ని.

ఓ పూట నే తిన్నా తినకపోయినా వాడికి ఆకలి అంటే తెలియకుండా చేసాను. కష్టాలు నేననుభవించినా ఆనందాన్ని వాడికి పంచాను. మమకారాన్ని మాతృప్రేమతో రంగరించి సుఖాల్ని చవిచూపించాను.

నేనంటే పంచప్రాణాలు వాడికి. నన్ను విడిచి ఒక్క క్షణం కూడా ఉండే వాడు కాదు.

ప్రథమ వత్సరాది నాటి
నవజీవన పల్లవములు
నవ్యావాసనాలవములు
వేణువులూ వివిధ పుష్ప
రేణువులూ తొలియామని
రాణువగని బ్రతుకంతా
హాయె యనుకొనెనా?

కృష్ణశాస్త్రి

వాడికి ఊహ తెలుస్తున్న రోజుల్లో ఓ పండుగ రోజు జరిగిన సంఘటనిది.


"అమ్మా! నాకీ కొత్త బట్టలు వద్దు" అని మారాం చేసాడు.


కంగారుపడుతూ "ఎందుకు నాన్నా!" అనడిగాను అవి నచ్చాయో లేవో నన్న అనుమానంతో.

అందుకు సమాధానంగా మరి నీకు లేవుగా!" అన్నాడు అమాయకంగా.

"బాబూ!" అంటూ వాణ్ణి ఆప్యాయంగా గుండెలకి హత్తుకున్నాను.

"నే పెద్దయ్యాకనిన్నీ చిరిగిన బట్టలు కట్టుకోనీయనమ్మా! కొత్త కొత్త చీరలు కొని పెడతాగా" అని వాడంటుంటే 'నా బంగారు కొండా' అనుకొని మురిసిపోయాను. పట్టలేని సంతోషంతో ఆనందబాష్పాలు రాల్చాను.





కాలం తనకు తాను సాగిపోతోంది. వాడు ఎదుగుతున్న కొద్దీ "వాణ్ణి ఓ ప్రయోజకుణ్ణి చేశానన్న" సంతృప్తితో బ్రతుకుతున్న నాకు... నా చిట్టి తండ్రి ఓ రోజు షాక్ తినిపించాడు.

దంపతులై మీ ఇద్దరూ ఈ ఇంట్లోకి అడుగుపెట్టిన సంఘటన అది.

అలా హఠాత్తుగా నిన్ను వెంట బెట్టుకుని వచ్చి "అమ్మా! రిజిస్ట్రార్ ఆఫీసులో ఈ అమ్మాయిని నీ కోడలిగా చేసుకొచ్చానని" వాడంటుంటే తట్టుకోలేకపోయాను.

కనీసం మాట మాత్రంగానైనా నీ గురించి నాకు చెప్పలేదు వాడు. చెబితే కాదనేదాన్ని కాదు. మరెందుకిలా అనుకోకుండా పెళ్ళి చేసుకోవాల్సి వచ్చింది. నా పిచ్చి తండ్రి కోరితే దేన్నయినా కాదన్నానా? వాడికి తెలియకుండా భోరున ఏడ్చేసాను. నా బాధని నాలోనే దిగమింగుకున్నాను. నాక్కావాల్సింది నా బాబు సుఖం.

"అందుకే మనసారా మీ ఇద్దర్నీ ఆశీర్వదిస్తుంటే" అప్పుడు వాడి ముఖంలో కన్పించిన కాంతిరేఖలు నాలోని బాధావీచికల్ని మటుమాయం చేశాయి. మనసును కుదుటపరచుకొని కూతురులేని లోటు తీర్చడానికి వచ్చిన కోడలిగా నిన్నూ వాడితో సమానంగా చూశాను.

...కానీ జరిగిందేమిటి? నా జీవితంలో వసంతం పూర్తిగా నీ సొంతమైంది.

నా సాన్నిధ్యం వీడి నీ సాంగత్యం చేసాడు వాడు. నువ్వు నా నుంచి నా కన్నాని దూరం చేస్తుంటే విలవిల్లాడాను. నీ చుట్టూ తిప్పుకుంటే సహించలేకపోయాను. వాడిని నీ ఇష్టం వచ్చినట్టు ఆడిస్తుంటే భరింపలేకపోయాను. వాడిని నీ ఇష్టం వచ్చినట్టు ఆడిస్తుంటే భరింపలేకపోయిందీ తల్లి హృదయం.

గొంతు మూగవోయి, గుండె చెరువై అతలాకుతలమయ్యాను... మరింకేం చేయను? చెట్టంత మగాణ్ణి పట్టుకొని చిట్టెలుకను చేసి ఆడిస్తుంటే నీతో పోట్లాటకు దిగడమే నే చేయాల్సింది. కానీ అలా చేయలేదు!

నాకు తెలుసు తల్లిగా నీతో పోట్లాటకు దిగితే వాడు కలుగ చేసుకోలేడని. నన్ను ఎదిరించనూ లేడు, నిన్నూ వారించనూలేడు. కాకుంటే తనలో తానే మధనపడేవాడు. మనిద్దరి మధ్యా నలిగి నలిగి కృంగిపోయేవాడు. నా చిన్నా కించిత్ వ్యధ చెందినా ఈ తల్లి హృదయం తల్లడిల్లిపోతుంది.

అందుకే మౌనంగా ఉండిపోయేదాన్ని.

నీ గురించి పూర్తిగా అర్థమైన నాకు, నువ్వు చెప్పింది నే వినకుంటే నా మీది కోపంతో నా బాబునేం అంటావోనని తెగ భయపడి పోయేదాన్ని. నీకు అనుకూలంగా చేయడానికి సిద్ధపడేదాన్ని.

నువ్వేది చేయమన్నా సంతోషంగా అంగీకరించేదాన్ని. నువ్వెన్నెన్ని మాటలన్నా సహనంతో పడేదాన్ని.

"నీ కోడలు నిన్నింత రాచి రంపాన పెడుతున్నా ఎలా సహిస్తున్నావు అనసూయమ్మా!" అని ఇరుగుపొరుగు నాపై జాలి పడుతుంటే బదులుగా నవ్వేదాన్ని.

"రాముడి లాంటి నీ కొడుక్కి లంకిణి లాంటి ఈ కోడలెట్లా దొరికిందమ్మా!" అంటూ నన్ను చేరి వాళ్ళేదేదో నూరి పోస్తుంటే ' మా ఏకుటుంబ విషయాలు మీకెందుకు' అంటూ కసిరేదాన్ని. నా కన్నయ్య సంసార విషయాలు, మన కుటుంబ విషయాలు బయటపడకూడదు. వాళ్ళందరి నోళ్ళలో నాని, మనం దిగజారి పోకూడదన్నదే నా ఆలోచన.

నిన్ను పల్లెత్తు మాటనటనకుండా నా పెద్దరికాన్ని నిలుపుకునేదాన్ని.

అలా అలా రోజులు గడిచాయి.

నీకూ ముగ్గురుపిల్లయ్యారు. దాంతోపాటు ఖర్చులూ పెరిగిపోయాయి. అందుకే నాతో ఊడిగాలు చేయించుకుంటూనే ఈ ముసలి ప్రాణానికింత తిండి పెట్టడం కూడా దండగనే స్థితికి వచ్చావు. అదీ నిజమే నన్పించేది.

ఆ రోజుల్లోనే నేను నా కన్నా నొక్కన్నే పోషించడానికి ఎంత ఇబ్బంది పడ్డానే? ముగ్గురు పిల్లలకు బట్టలు, చదువులు, కోరుకున్నవి తెచ్చిపెట్టూ తండ్రిగా నా చిట్టి తండ్రి వాడెన్ని ఇక్కట్లు పడ్తున్నాడో కదా!

అందుకే మీకు చేదోడువాదోడుగా ఉండాలని ఏదైనా పనికూడా చేద్దామనుకున్నాను. నా కది అలవాటే. కానీ ఈ వయసులో కూడా నే కష్టపడితే చూడలేడు వాడు. అలా అని నీ దృష్టిలోనే తేరగా తింటూ ఉండలేను.

పైగా ఇపుడు మీపెద్దబ్బాయికి పెళ్ళి నిశ్చయమైపోయింది. అంటే నీకూ కోడలు రాబోతోంది. నాపై కోడలిగా నీవు చూపే ఆదరణకి ఆ అమ్మాయి ఎలా భావించుకొంటుంది! పైగా ఈ కాలపు పిల్ల. ఆ అమ్మాయి మనసెలాంటిదైనా ఈ ఇంట్లో అత్తలకి స్థానంలేదనే అభిప్రాయమేర్పరచుకుంటుంది. 'కోడలిదే సామ్రాజ్యమనే స్థిర నిశ్చయానిఆఇ వస్తుంది.



**లోగుట్టు**

"సర్కస్‌లో ఈ పులులూ, సింహాలూ అన్నీ మీరంటే తెగ భయపడుతూ చెప్పిందల్లా చేస్తున్నాయ్! వీటిని మీరు ఎలా లొంగ దీసుకున్నారు?" విలేఖరి సోమ్‌సింగ్ అడిగాడు.

దానికి రామ్‌సింగ్ ఇలా చెప్పాడు : " మా ఇంట్లో నా భార్య నేటితో గదమాయిస్తూ నన్ను కంట్రోల్ చేస్తోంది. ఇక్కడ నేను - " నా భార్యని" మనసులో తల్చుకుని - నా హంటర్ ద్వారా ఆ "కసిని" - వీటి మీద తీర్చుకుంటుంటాను"

యు. చిట్టిబాబు
కొత్తగూడెం

అలాంటప్పుడు మరి నీ పరిస్థితిని కూడా ఒక్కసారి ఊహించుకో! నీ ద్వారా నాకు పట్టిన గతే నీకూ పడుతుంది. నీ జీవితంలో వసంతం పూర్తిగా నీ కోడలి సొంత మౌతుంది. నిన్నూ నీ కోడలు చిన్న చూపు చూస్తుంది. బదులుగా నాలాగే నీవూ అశాంతికి గురి అవుతావు. మరి నీవు బాధపడుతుంటే చూసి నా తండ్రి తట్టుకోగలడా? వయసు మళ్ళుతున్న దశలో కూడా వాడు వ్యధ చెందకూడదు. అలా జరగకూడదూ అంటే నువ్వు గల గలా నవ్వుతూ ఉండాలి. నీవానందంగా ఉండాలి అంటే నీ కోడలు నీపై పెత్తనం వహించకూడదు. అలా జరగకూడదు. అలఅ జరగొద్దంటే నీవు నాపై పెత్తనం ఆపాలి. కానీ ఈ దశలో అది నీ వల్ల కాని పనని నాకు తెలుసు.

అందుకే నేను తప్పుకుంటున్నాను.

అత్తగా నీఏవ్వూ ఏత నేనభవించిన కష్టాలను తిరిగి అత్తగా నీవ్వూ నీ కోడలి వలన అనుభవించకూడదు. నా చరిత్ర నీ విషయంలో పునరావృతం కాకూడదనే నా ఆకాంక్ష. అసలు మన వంశంలోనే ఇకనుంచి 'అత్తా కోడళ్ళలా కాదు వాళ్ళు తల్లీ బిడ్డల్లా కలిసిపోయారు" అని ఇతరులు చెప్పుకుంటూ ఉండాలి. కుటుంబంలో ప్రతి పువ్వూ నవ్వుతూ ఉండాలి. ప్రతి మనిషి జీవితం నవరుచుల సమ్మేళనం! ఉగాది పచ్చడిలా తీపి, వగరు, పులుపు వంటి రుచులు ఉన్నట్లే ప్రతిమనిషి జీవితం లోనూ సుఖం, దుఃఖం, సంతృప్తి, అసంతృప్తి వంటివి ఉంటూనే ఉంటాయి. మనిషి అన్నింటినీ స్వీకరించడానికి సిద్ధపడాలే తప్ప ఉగాది పచ్చడిలో వేపపూత ఏరేసి మరొకరికి పెట్టినట్లు సుఖాలు మనకు, కష్టాలు ఎదుటి వారికి అని కోరుకోకూడదు. అన్నింటినీ సమైక్యంగా, సమంగా భరించగలగాలి. అప్పుడే ఆ కుటుంబంలో వసంతం అందరిసొంతమౌతుంది. సంతసం వెల్లి విరుస్తుంది. ఇదంతి జరగాలంటే నేను నేచెంత ఉండకూడదు. శిశిరం విసిరిన బాణాలకు ఈ పువ్వు కోలుకోలేకు గాయాలకి లోనైంది. నీ ఇష్టానికి వ్యతిరేకంగా తిరిగి వసంతంకోసం నేనూ ఎదురు చూస్తే నువ్వు సహించలేవు! అది తెలిసిన నీ కోడలు తానూ నీ బాటలోనే నడిచే అవకాశం ఉంది.

అందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నాను.

చివరగా నీ బాగుకోరి మరొక్క విషయం. నాపై చూపిన పెత్తయనం నీ కోడలిపై చూపించకు. మారుతున్న కాలంతో పాటుగా మారుతున్న మనస్తత్వంగల ఆడపిల్లనీ కోడలుగా రాబోతోంది. నీ శేష జీవితం నాలా కాకుండా ఆనందమయం కావాలంటే నీ తత్వాన్ని మార్చుకో! అప్యాయతల్ని అలవర్చుకో. అత్తని అమ్మలా చూడలేకపోయినా, కోడల్ని కూతురిగా చూసుకో!

నా విషయం తెలిసి నాకన్నా తట్టుకోలేడు. ఈ పోటీకేనా ఆచూకీ తెలియక ఎంత బెంగపెటుకున్నాడో పిచ్చితండ్రి? కానీ ఏం చేయను..? వాణ్ణి నీచేతుల్లో పెట్టి నే వెళ్ళిపోతున్నాను.. మళ్ళీ కన్పించలేనంతదూరంగా, తిరిగి రాలేనంత సుదూరంగా.

నన్ను క్షమించమని వాడికి చెప్పవూ?

నీ పెద్దరికాన్ని నిలబెట్టుకొని, తర్వాత తరాలైన మన వంశీయులకీ ఈ గ్రహచారం పట్టకుండా రాబోయే నీ కోడల్ని ప్రేమగా చూసుకో! తర్వాత అత్తగా నిన్నూ గౌరవిస్తుంది.

అదే నాక్కావాల్సింది.

కోడలిగా నువ్వివ్వాల్సింది.